ISSN:3048-5908 Impact Factor:3.63(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024, pp. 18-22

# నాగరికతను ప్రతిబింబించిన 'నెమలి నార'

**డా. సద్మేక లలిత**

సహ ఆచార్యులు

తెలంగాణ సారస్వత పరిషత్తు

ఓరియంటల్ కళాశాల, హైదరాబాద్

**స్థూల పరిచయం**: కవి, కథకుడు, నవలా నాటక రచయిత, రేడియో రచయిత, నటుడు, దర్శకునిగా తెలుగు సాహిత్యంలోని విభిన్న ప్రక్రియలను పరిపుష్టం చేసిన రచయితగా బోరి మురళీధర్ గారు పాఠకుల మదిలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం సొనాల గ్రామంలో 1955 జూన్ 12న జన్మించారు. వృత్తి రీత్యా వ్యవసాయశాఖ విస్తరణాధికారిగా 35 ఏళ్లు పని చేశారు. వృత్తిని, ప్రవృత్తిగా సాహిత్య రంగాన్ని రెండింటినీ సమన్వయం చేసుకున్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేయడం, అక్కడే పుట్టి పెరగటంతో, అక్కడి గిరిజనులతో మమేకం అయ్యి, కలసి పనిచేసే అవకాశం కలిగింది. వృత్తిరీత్యా గిరిజన ప్రాంతాల్లో పర్యటించాల్సిన సందర్భాల్లోనే తన ప్రవృత్తి అయిన రచనా వ్యాసంగానికి కావలసిన కథావస్తువులు ఎంపిక చేసుకోవటం జరిగింది. వారి సాహిత్య వ్యాసంగాన్ని విస్తృతం చేసుకునేందుకు అవకాశం ఏర్పడింది. అందుకే ఆయన రచనల్లో ఎక్కువగా గిరిజన జీవితాల నేపథ్యమే కన్పిస్తుంది.

**కీలకపదాలు:** వరాలు, వైనం, రామాయణం, వాల్మీకి, ఋగ్వేదం

**బోరి మురళీధర్** రచయితగా రాసిన తొలికథ అడవిపువ్వు 1987లో ప్రచురితం అయ్యింది. తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే కథగా 'దశమి' కథను చెప్పుకోవచ్చు. తెలంగాణలో మొహర్రం పండుగ చారిత్రక పూర్వపరాలను రచయిత ఈ కథలో తెలియచేశారు. వీరు రాసిన 'కొత్త నిర్వచనం' అనే కథ సాహితీ విమర్శకుల ప్రశంసలను అందుకుంది. 'ది టాకింగ్ ఎఫిజీస్' అనే హాస్య కథ నవ్య వీక్లీలో ప్రచురించబడి ప్రత్యేక బహుమతిని కైవసం చేసుకుంది. మురళీధర్ గారు, తన తండ్రి లక్ష్మణ్ గారి జీవిత విశేషాలను ఆదర్శాలను స్ఫూర్తిదాయకంగా తీసుకుని 'నిరుడు కురిసిన కల' అనే నవలను రాశారు. ఈ నవల ఆంధ్రప్రభలో 1995లో ప్రచురితమై దీపావళి పోటీల్లో ప్రథమ బహుమతి పొందింది. దొరల దౌర్జన్యాలను, కుల, మత విద్వేషాలను ఒక ఉపాధ్యాయుడు శాంతియుతంగా ఎలా పరిష్కరించాడు? అనేదే ఈ నవలా ఇతివృత్తం. తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో వెలువడిన ఉత్తమ గ్రంథాలకు 2024వ సంవత్సరానికి గాను తెలంగాణ సారస్వత పరిషత్తు రాష్ట్రస్థాయి పురస్కారాలను ప్రకటించింది. అందులో 'నిరుడు కురిసిన కల ' అనే నవలకు గాను రచయిత బోరి మురళీధర్ గారికి వరిష్ఠ పురస్కారాన్ని పరిషత్తు అందజేసింది. రచయిత, ఆదిలాబాద్ జిల్లా మాండలికంలో 150 పైచిలుకు లఘునాటికలను స్వీయ దర్శకత్వంలో రచించి, నటించారు. అవి రేడియోలో ప్రసారమయ్యాయి.

ఏ ప్రక్రియల్లో రచనలు వెలువడినా, అందులో నవ్యత కనిపించాలి. పాఠకులకు ఒక కొత్త అనుభూతిని కలిగించాలి అనే లక్ష్యమే వీరి రచనల్లో ప్రతిఫలిస్తుంది. మురళీధర్ కథల్లోని వస్తువులన్నీ భిన్నంగా ఉంటాయి. నవ్యతను పాఠకులకు అందించాలనే ఉత్సుకత ఉన్నా, తనకు తెలియని జీవితాన్ని తన కథల్లో ఆవిష్కరించరు. తాను అనుభూతికి లోనైనా, వాస్తవాల్ని మాత్రమే కథా వస్తువులుగా

ISSN:3048-5908 Impact Factor:3.63(SJIF)

# సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024, pp. 18-22

తీసుకుంటారు. రచయితకు సుపరిచితమైన గిరిజన, గ్రామీణ జీవితాల్లోని మానవీయ కోణాల్ని, వారి ప్రవర్తనలను దగ్గరినుండి చూసి, వారితో మమేకం అయినప్పుడు కల్గిన స్పందనలను మాత్రమే కథలుగా ఆవిష్కరిస్తారు. అందుకే వారి కథల్లో పరిచయమున్న పాత్రలు, వారి తాలూకా జీవితాలు మాత్రమే కనిపిస్తాయి. కాబట్టే వారి కథలు ఎంతో సహజంగా, వాస్తవీయంగా ఉంటాయి. కథ రాసేటప్పుడు కథా వస్తువుపై లోతుగా పరిశోధన చేసిన అవగాహనతో రచన ప్రారంభిస్తారు. అందుకే వీరి రచనల్లో జీవత్వం ఉట్టి పడుతుంది.

తెలుగు సాహిత్యంలో పర్యావరణ స్పృహతో వచ్చిన కథలు చాలా తక్కువనే చెప్పుకోవచ్చు. మానవ ధర్మాన్ని ప్రకృతిపై ఆరోపించి వచ్చిన కథనాలు కొన్ని ఉండవచ్చు. కానీ ఒక కథంతా చెట్టు చుట్టూ అల్లుకోవడం, ప్రధాన పాత్రధారిగా చెట్టు ఉండడం అనేది బోరి మురళీధర్ గారు రాసిన 'నెమలి నార' కథలో మనం చూడవచ్చు. రచయిత చెట్టును కథా వస్తువుగా చేసుకుని, పర్యావరణ స్పృహతో, మూడు తరాల కుటుంబ వ్యవస్థను, సామాజిక పరిణామ క్రమాన్ని ఆవిష్కరిస్తూ, మానవుడి గమనం ఎటువైపు వెళుతుందో ఆలోచించుకోమ్మనే ప్రశ్నార్థక సందేశాన్ని ఈ కథా ముగింపులో పాఠకులకు వదిలివేశారు. సాంప్రదాయక వైద్య విద్యల్లో ఆయుర్వేద వైద్యానికి ఉన్న ప్రాముఖ్యతను ఈ కథలో రచయిత తెలియజేశారు. ఈ 'నెమలి నార' అనే కథ 2005 లో ఆంధ్రజ్యోతి నవ్య వార పత్రికలో ప్రచురించబడింది. ఈ కథ 'తానా' ప్రోత్సాహక బహుమతి తో పాటు, 2006లో మంజీర రచయితల సంఘం అందించే వట్టికోట ఆళ్వారుస్వామి ఉత్తమ కథా పురస్కారాన్ని పొందింది. మరాఠీ, హిందీ భాషల్లోకి కూడా అనువదింపబడి పాఠకుల ప్రశంసలు అందుకుంది. కథ సాహితి వారి కథ - 2005 సంకలనంలో నెమలి నార అనే కథ ప్రచురింపబడింది. తర్వాత నెమలి నార అనే పేరుతో కథా సంపుటిగా వెలువడింది. ఈ కథా సంపుటిలో మొత్తం 18 కథలు ఉన్నాయి. తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో పెరిగే ఈ నెమలినార చెట్టు సర్వరోగ నివారిణి. ఆయుర్వేదంలో ఈ చెట్టుకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఈ చెట్టు ప్రాశస్త్యానికి కొంత సృజనాత్మకతను జోడించి, అందరికీ తెలిసేలా సులభంగా చేరువయ్యే కథా రూపంలో రచయిత ఆవిష్కరించారు.

**ప్రధాన పాత్రధారి.:** ఈ కథలో నారాయణయ్య ప్రధాన పాత్రధారి. తరతరాలుగా వచ్చిన ఆయుర్వేద వైద్యాన్ని ముందు తరాలకు అందజేయాలనే సదుద్దేశంతో, ఉచితంగా ఆయుర్వేద వైద్యం చేస్తూ, ఆయుర్వేద వృక్ష సంపదను సంరక్షిస్తూ ఉంటాడు. ఆయనకు ముగ్గురు కొడుకులు. తరాలు మారుతున్న కొద్దీ సమాజంలో వచ్చే పెను మార్పులకు తండ్రి కొడుకుల మధ్య రాగద్వేషాలు ఎలా చెలరేగాయి? మానవీయ విలువలు ఎటు పోతున్నాయి? అనే కోణంలో గ్రామీణ వాతావరణాన్ని కళ్లకు కట్టినట్లు రచయిత ఈ కథలో ఆవిష్కరించారు. పూర్వీకుల అనుభవ జ్ఞానం గొప్పదా? ఆధునికుల ఆలోచనా జ్ఞానం గొప్పదా? అనే ప్రశ్నకు సవాల్ ను విసురుతూ ముగింపులో రచయిత తేటతెల్లం చేశారు. కుటుంబంలోని సంఘర్షణకు ప్రకృతి పరిరక్షణ, ఆయుర్వేద వైద్యం అనే అంశాలు ఎలా కారణాలుగా మారాయి? అనే కోణాల్ని జోడిస్తూ, అంతర్లీనంగా మానవుడు ప్రకృతిని సంరక్షించాలి. లేకపోతే వినాశనం తప్పదు అనే సందేశాన్ని ఈ కథలో రచయిత తెలియజేశారు.

నెమలినార, ఈ కథ రామాయణ నాటక ప్రదర్శన వర్ణనతో ప్రారంభమవుతుంది. నారాయణయ్య రాముని పాత్రధారి. నాటకం రసవత్తర ఘట్టంలో ఉన్నప్పుడు వేదికపైకి ఒక వ్యక్తి వచ్చి, నారాయణయ్య చెవిలో ఏదో చెబుతాడు. వెంటనే నారాయణయ్య స్టేజ్ పైనుంచి కిందకి దిగుతాడు.

"ఆ దృశ్యం చూస్తే రాయిలా మారి అడవిలో పడి ఉన్న అహల్యను మనిషిగా మార్చడానికి విశ్వామిత్రుని వెంట నడుస్తున్న రాముడు గుర్తుకు వస్తున్నాడు"(కథా సాహితి, కథ - 2005. పుట : 283)

ISSN:3048-5908 Impact Factor:3.63(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024, pp. 18-22

రచయిత వ్యాఖ్యానం గమనిస్తే నారాయణయ్య ఏదో లోకోపకారం చేయడానికి వెళుతున్నాడు అనే సూచన మనకు ముందుగానే అందించాడు. కథ అంతా సర్వసాక్షి ప్రథమపురుష దృష్టి కోణంలో నడుస్తుంది. కాబట్టి రచయిత వ్యాఖ్యానం కథలో అక్కడక్కడ కనిపిస్తుంది.

కట్ల ఆశన్న దుక్కిటెద్దుకు నోటిలో నుంచి నురగలు వస్తున్నాయని చెప్పడంతో, తనకు తెలిసిన ఆయుర్వేద వైద్యంతో బతికించడానికి నారాయణయ్య నాటకం మధ్యలోనే వదిలేసి వెళ్లిపోతాడు.
"అప్పుడు - నాటకం కన్నా ఒక మూగజీవి ప్రాణమే గొప్పదని, తమ వినోదం కన్నా - తమ దుక్కిటెద్దు చాలా గొప్పదని వారు అనుకొంటారు." (కథా సాహితి, కథ - 2005. పుట: 283)
ఆనాటి సమాజంలో ప్రజలకు మూగజీవాలతో ఉన్న అనుబంధం ఎలాంటిదో తెలుస్తుంది. నారాయణయ్యకు పశు వైద్యం తెలుసు కాబట్టి, దుక్కిటెద్దు ప్రాణానికి ఎలాంటి ముప్పు లేదని, ఒక వ్యక్తిపై నమ్మకం ఉంచి, ప్రజలు ఆలోచించడం అనేది, ఆనాటి సమాజంలో వ్యక్తులకు ఇచ్చే విలువ, నమ్మకం ఎలాంటివో ఈ మాటల వల్ల తెలుస్తున్నాయి.

"నారాయణయ్య కుటుంబాన్ని పోషించడం అంటే, తమ కుటుంబాన్ని పోషించుకోవడమంత బాధ్యతగా భావిస్తారు. ఆ వూరి జనాలు".(కథా సాహితి, కథ - 2005. పుట : 284)

ఆనాటి సమాజంలో స్వార్థం లేని, నిలువెత్తు మనిషికి నిదర్శనంగా నారాయణయ్య పాత్ర ఉంటుంది. తనకు తెలిసిన ఆయుర్వేద వైద్యాన్ని ఉచితంగా చేస్తాడు, జనాలు అందుకు ప్రతిఫలంగా ఏమి ఇచ్చినా తీసుకోడు. కాబట్టి జనాలు ఆయన మీద ఉన్న గౌరవం, ప్రేమతో తమకు తోచినంతలో కాయ, పండు, ధాన్యం రూపంలో వారి కుటుంబ అవసరాలు తీరుస్తారు. మనిషికి మనిషి సాయం చేసే గుణం ప్రజల్లో ఉండేది.

" పిచ్చుకలు తాము పెంచిన పిల్లలకి రెక్కలొచ్చినాయని గమనించి, గూడులోని పిల్లల్ని బయటికి తరిమివేయాలని
ప్రయత్నిస్తున్నాయి."(కథా సాహితి, కథ - 2005. పుట : 284)
రచయిత మురళీధర్ గారు తాను చెప్పబోయే కథా సంఘటనకు తాలూకా వర్ణనను సూచనప్రాయంగా ప్రకృతి వర్ణనతో ప్రతీకాత్మకంగా తెలియజేసిన తీరు బాగుంది. నారాయణయ్య ఉమ్మడి కుటుంబం విచ్ఛిన్నం కావడం, గూడు లాంటి ఇంటిని ముక్కలు చేసి, కొడుకులు, ఆస్తులు పంచుకుని తండ్రిని ఒంటరిగా వదిలేస్తారు.

"ఈ విద్య చేతవడ్తే కడుపు నింపుతదావే అయ్యా! నీ జమాన వేరు." (కథా సాహితి, కథ - 2005. పుట: 285)
కొడుకులు ఇంటి స్థలాన్ని పంచుకునే క్రమంలో, ఆయుర్వేద మొక్కలు, వృక్షాలు ఉన్న స్థలంలో వాటిని కూకటి వేళ్ళతో సహా పెకలించి, అవతల పారేయాలని నారాయణయ్యకు చెబుతారు. అప్పుడు నారాయణయ్య సాంప్రదాయక ఆయుర్వేద విద్య నలుగురికి ఎంతో ఉపయోగపడుతుందని, కొడుకుల్ని నేర్చుకుని, ఉచితంగా సేవ చేయాలని చెబుతాడు. స్వార్థం పులుముకున్న కొడుకులు, ఈ విద్య వల్ల మాకు ఏం ప్రయోజనం వస్తుంది? ఉచితంగా నీలా మేము సేవ చేసి, మా సమయాన్ని వృధా చేసుకోలేం అని అంటారు. అయినా ఇప్పుడు పశువులకు, మనుష్యులకు రోగాలు వస్తే ఆసుపత్రులు, అల్లోపతి మందులు ఉన్నాయి. ఈ ఆయుర్వేద మందులు ఎవరు వాడుతారు ?అంటూ మారిన సమాజపు తీరును తెలియజేస్తారు.

నిస్వార్థంగా అర్ధరాత్రి, అపరాత్రి అనే తేడా లేకుండా ఆయుర్వేద వైద్యంతో ఎన్నో మూగజీవాల ప్రాణాలు కాపాడిన నారాయణయ్య గొప్పతనం కొడుకులకు తెలియటం లేదు.

ISSN:3048-5908 Impact Factor:3.63(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024, pp. 18-22

"కాలం మారి పోయిందే అయ్యా! దాంతోటి మనుషులు గూడా మారి పోయింర్రు, ఆళ్ళతోని మనం గూడా మారిపోవాల! మారనంటే కుదరది." ( కథా సాహితి, కథ - 2005 . పుట : 285)

రచయిత, మనుష్యుల్లో వారి ప్రవర్తనల్లో వస్తున్న, వచ్చిన మార్పుల్ని గాఢమైన సంభాషణల ద్వారా తెలియజేస్తున్నారు. మార్పు? ఎటువంటి మార్పును మనం స్వీకరించాలి? అనే ఆలోచనల్ని పాఠకుల్లో కలిగించే పదునైన వాక్య నిర్మాణశైలి బాగుంది.

"మా కాలంల మేము బతకాలంటే నీ మెరంగ ఉంటే కుదరది.
యాల్ల వడితే ఎంతకన్నా తెగియ్య వడ్తది"( కథా సాహితి, కథ - 2005. పుట : 286)

తండ్రి నారాయణయ్య, ఆయుర్వేద మొక్కల్ని పెరికి వేయడానికి ఒప్పుకోకపోవడంతో పెద్ద కొడుకులోని నీచ ప్రవృత్తి బయటపడుతుంది. ఎంతగా అంటే తాము బతకటం కోసం కన్నతండ్రిని కూడా అవసరం వస్తే లెక్కచేయనని, ఒక బెదిరింపుతో కూడిన మాటలను బట్టే తెలుస్తుంది. మానవ రక్త సంబంధాలను కూడా లెక్కచేయని తత్వం మనుషుల్లో పేరుకుపోయింది. పాలుతాగిన తల్లి రొమ్మునే తన్నే కాలం, లోకం తనమీద తనే మట్టివోసుకుని పూడ్చుకునే కాలం వచ్చింది అంటూ సాగే పదునైన మాటలు.. సమాజపు పోకడలను ప్రశ్నిస్తున్నాయి. సమాజం ఏ వైపుకు వెళ్తుంది? మానవుల నైజాల్లో ప్రకృతినే కబలించే విషభీజాలు ఎందుకు నాటబడుతున్నాయి? అందువల్ల ముందు తరాల భవిష్యత్తు, మనుగడ అగమ్య గోచరంగా మారుతుందనే ఆవేదన రచయిత కథలో పలికించిన సంభాషణల్లో వ్యక్తీకరించబడింది.

"నెమలి నార చివర కొమ్మలపై ఆకుల అమరిక నెమలి ఫించానికి నెమలి కన్నులు అమర్చినట్లుగా ఉంటాయి. " ( కథా సాహితి, కథ - 2005 . పుట: 286)

రచయిత పరిశీలనా దృష్టితో, అవగాహనతో నెమలినార చెట్టు గురించి కూలంకషంగా తెలుసుకున్నారు. ఈ నెమలి నార ఆయుర్వేద వైద్యంలో పశువులకు, మనుషులకు వచ్చే రోగాలు నయం చేయడానికి ఉపయోగపడుతుందని నిర్ధారించుకున్నాకే ఈ కథను రాసినట్లు తెలుస్తుంది.

అందుకే నెమలి నార వర్ణనలో అంత సహజత్వం కనిపిస్తుంది. చాలామందికి తెలియని ఒక కొత్త విషయాన్ని, నెమలినార ప్రయోజనాల్ని రచయిత, కథలోని సంఘటనల వరుస క్రమంలో, సందర్భానుసారంగా దాని ఔషధ గుణాల్ని తెలియజేశారు.

నారాయణయ్య కొడుకులు అనుకున్నట్లుగానే నెమలి నార చెట్టుతో సహా, ఎన్నో అమూల్యమైన ఆయుర్వేద మొక్కల్ని పెకిలించి పారవేశారు. కాలక్రమంలో ప్రకృతి తనదైన శైలిలో, మానవులకు గుణపాఠాన్ని నేర్పుతుందా! అని అన్నట్లుగానే నారాయణయ్య చిన్న కొడుకు, పయ్య సుక్కెద్దు చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడే సందర్భం వస్తుంది. నెమలి నార ఆకులు మాత్రమే సంజీవనిలా పనిచేస్తాయని నారాయణయ్య చిన్న కొడుకుతో చెప్పడంతో, అతను నెమలి నార ఆకుల కోసం అడవి అంతా గాలించి, అవి దొరకక పోవడంతో ఇంటికి తిరిగి వస్తాడు.

"చిన్నోడి శరీరపు వాసనను, అడుగుల కదలికలను దూరం నుంచే గుర్తుపట్టిన పయ్య సుక్కెద్దు ఉలిక్కిపడి లేచి, నెమలి నార దొరికిందా? అని చూపులతోనే అడిగినట్లు అనిపించింది." ( కథా సాహితి , కథ - 2005. పుట: 289)

ISSN:3048-5908 Impact Factor:3.63(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-2, (Oct-Dec), 2024, pp. 18-22

రచయిత మూగజీవాల స్వభావాన్ని, మనుష్యులతో వాటికున్న అనుబంధాన్ని ఎంతో సహజంగా వర్ణించారు. మూగజీవాలైనా, యజమాని పట్ల, వాటికున్న నమ్మకం, విశ్వాసం, భరోసా కొడుకులకు, తమ తండ్రి పైన ఉండటం లేదనే వాస్తవం ఈ సంఘటన ద్వారా వ్యక్తీకరించబడింది. నెమలి చెట్టును నరికి ముక్కలు చేసి, ఇంటి ఆవరణలోనే పడేయడంతో, చిన్న కొడుకు పశ్చాతాపంతో బాధపడుతూ, ఏదో గుర్తుకు వచ్చినవాడిలా అక్కడికి వెళ్లి చూడగా నవనవలాడుతూ పచ్చగా నెమలి నార ఆకులు కనిపిస్తాయి.

**ముగింపు:**

రచయిత బోరి మురళీధర్ గారు తనకున్న సైన్స్ పరిజ్ఞానాన్ని అందునా వృత్తిరీత్యా వ్యవసాయ శాఖలో పనిచేసిన అనుభవ జ్ఞానాన్ని మేళవించుకొని సృజనాత్మకతను జోడించి, అద్భుతమైన కథగా మలిచారు. తెలంగాణ యాసలో, అందులో ప్రత్యేకమైన చక్కని ఆదిలాబాద్ మాండలికంలో కథ రాయడం వల్ల కథకు సహజత్వం చేకూరింది.

వజానుకలు ( బదనికలు) అంటూ తీగ జాతుల గురించి, అవి పెరిగే వాతావరణాన్ని గురించి, పరాన్న జీవులుగా ఏ వృక్షాన్ని ఆశ్రయించి పెరిగితే, ఆ వృక్ష ఔషధ గుణం వాటికి అబ్బే పద్ధతి గురించి కథానుసారంగా రచయిత చెప్పిన తీరు బాగుంది. వృక్షశాస్త్ర ప్రాథమిక విజ్ఞానాన్ని పాఠకులకు అందిస్తూ కొత్త అనుభూతిని కలగజేశారు. ఒక కథ ఒక సంఘటన చుట్టూ మాత్రమే నడుస్తుంది కానీ రచయిత మురళీధర్ గారు ఒక్క కథలోనే ఎన్నో కోణాల్ని ఆవిష్కరించారు నాటక ప్రదర్శన, గ్రామీణ వ్యవస్థ మానవీయ విలువలు, ఆయుర్వేద వైద్యం, సామాజిక పరిణామ క్రమం వంటి పలు అంశాల్ని నెమలినార కథలో ప్రస్తావించిన విధానం బాగుంది. సంభాషణలు, వర్ణనలు భాష, శైలి కథకు అనుగుణంగా రచయిత పాటించారు. కొన్నిచోట్ల రచయిత వ్యాఖ్యానం ఎక్కువగా ఉండి చదివే పాఠకులకు అసంతృప్తిని కలిగిస్తుంది.కథలో అంతర్లీనంగా రచయిత వ్యాఖ్యానం ఉండవచ్చు కానీ, అది కథలో పాత్ర మనోభావాల ద్వారా చెప్పిస్తే కథ ఇంకాస్త బాగుండేది.

పూర్వీకుల జ్ఞాన సంపదను, సాంప్రదాయిక విద్యలను పరిరక్షించి, వాటిని భావితరాలకు అందజేయాలని రచయిత ఈ కథ ద్వారా చక్కని సందేశాన్ని ఇచ్చారు. ఈనాడు మనం అవలంబిస్తున్న, అందిపుచ్చుకున్న శాస్త్రీయ విజ్ఞానానికి మూలాలు పూర్వీకులు అందించిన విజ్ఞానమే అనే ఎరుకను రచయిత ఈ కథ ద్వారా తెలియజేశారు.

పర్యావరణ పరిరక్షణ, ప్రకృతిని కాపాడుకోవాలి అనే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందనే సందేశాన్ని ఈ కథ తెలియజేస్తుంది.

**ఆధార గ్రంథాలు:**

కథా సాహితి, పాతికేళ్ల కథ (1990- 2014), కథ - 2005. మురళీధర్, బొరి. నెమలి నార.

వెంకట సుబ్బయ్య, వల్లంపాటి. కథాశిల్పం ,ప్రథమ ముద్రణ (జనవరి,1995), విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌజ్, హైదరాబాద్.